# బలహీనత

అగ్నికి ఆజ్యం తోడైతే భగభగ మండటం ఎంత సహజమో, ఒకే విషయాన్ని పలువురు నొక్కి చెప్పుతూంటే అందులో సత్యం ఉందని భ్రమించటమూ అంతే సహజం. పార్వతి ఇందుకు అతీతురాలు కాదు. ఆమెలో పదహారేళ్లుగా పాతుకుపోయిన ఆదర్శాలు, నమ్మకాలు పేకమేడల్లా కూలిపోయాయి. ఆమెలో చెప్పలేని నిర్వేదం, తీరని అశాంతి చోటు చేసుకున్నాయి. ఆమెలో ఓర్పు నశించింది.

రామం రాకకోసం ఆమె గుమ్మం వద్దే నిలబడి నిరీక్షించసాగింది. కాంతమ్మ మాటలు ఆమె చెవుల్లో మార్మోగుతున్నాయి.

"పార్వతీ! నీకు తెలుసునో తెలియదో కాని, రామం ఇప్పుడు నీ చెప్పుచేతల్లో లేడు. వాడు ఎవత్తెనో వెంట వేసుకుని తిరుగుతున్నాడు. మావారికి వాళ్లిద్దరూ అనేక పర్యాయాలు హోటళ్లలోనూ, సినిమాలలోనూ కనిపించారట" అంది కాంతమ్మ.

పార్వతి కందులో పెద్ద తప్పు కనిపించలేదు. "వాడికేం తెలియదా? నా పెంపకంలో పెరిగిన వాడు పెడత్రోవ ఎంత మాత్రం పట్టడు. స్నేహితురాలితో తిరిగినంత మాత్రాన తల్లిదండ్రులను ఎదిరించే శక్తి వాడిలో ఉండదు" ఇదే అంది ఆమెతో.

"ఎంత వెర్రిబాగులదానివి, పార్వతీ! ఎంతైనావాడు నీ కన్నబిడ్డడా? వాడికి మీ పట్ల ఆదరాభి మానాలు ఉంటాయని అపోహ పడుతున్నావు. చేతులు కాలిపోయిన తరువాత ఆకులు పట్టుకొని లాభం ఉండదు. వాడికో ముక్కుతాడు ఎంత త్వరగా వేస్తే అంత మంచిది. నీ సుఖాన్నికూడా చూసుకోకుండా వాణ్ణి పెంచిపెద్ద చేశావు. నాదంతా వట్టి అపోహ అయితే, నాకెంతో సంతోషం. ఏది ఏమైనా తెలిసిన దానిని, కావలసినదానిని కాబట్టే ఇంతగా చెప్పడం. నా మాటలను తప్పు పట్టుకోకు" అంది కాంతమ్మ.

కాంతమ్మ మాటలే ఆమెలో మాటిమాటికి ప్రతిధ్వనిస్తున్నాయి.

'వాడు నా కొడుకు కాడా? కననంత మాత్రాన వాడికి నేను తల్లిని కానా? పదహారేళ్ళు కళ్లలో పెట్టుకుపెంచానే - ఇప్పుడు రెక్కలు రాగానే మమ్మల్ని వదిలేసి వెళ్లిపోతాడా వాడి దారిని వాడు? ఈ నాడే ఈ సంగతి పరిపూర్ణంగా పరిష్కరించుకోవాలి.' ఇదే ఆమెలో తపన.

రామం రానే వచ్చాడు.

"ఎక్కడ తిరుగుతున్నావురా ఇంత సేపూ? ఆఫీసు అయిదు గంటలకే వదిలేసినా రాత్రి ఎనిమిది గంటలకా రావటం? రోజురోజుకీ నీ తిరుగుళ్లు ఎక్కువై పోతున్నాయి." వాడిని వీధిలోనే నిలేసింది.

ఇరవై రెండేళ్ల రామం మాట్లాడకుండా తల వంచుకుని ఇంటిలోపలికి వెళ్లిపోయాడు.

"ఏంరా, నే నంటే నీకు ఖాతరు లేదా? అడిగిన దానికి సమాధానం చెప్పాలన్న పరిజ్ఞానం లేదా? నీ చదువెందుకు - తగలెయ్యనా?"

రామం కొంచెం ఆశ్చర్యపోయాడు. తల్లి తన్ను వీధిలోనే నిలుచుని ఎందుకంతలా దులపరిస్తున్నదో అర్థం కాలేదు వాడికి.

"మరేం లేదమ్మా. స్నేహితులతో పార్కుకి వెళ్లాను. లేటయిపోయింది. పొరపాటే" రామం మెల్లిగా సమాధానం చెప్పాడు.

"స్నేహితులతోనా, స్నేహితురాలితోనా? ఒరే, రామం! వెనకటి కో పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగుతూ ఎవరూ చూడటం లేదు అనుకుందట. నీవు ఎవళ్లతో తిరుగుతున్నావో లోకులు చూడటం లేదనుకోకు. మమ్మల్ని మభ్యపెట్టాలనుకోవటం శుద్ధ పొరపాటు."

"అమ్మ! నేను సరళతో తిరగటం లేదని అనటంలేదు. ఆమె మా ఆఫీసులో పని చేస్తోంది. అప్పుడప్పుడూ సరదాగా పార్కుకీ, సినిమాకీ వెళ్లటం నిజమే. ఇందులో తప్పు పట్టవలసినదేమీలేదే?"

"ఒరే! పెళ్లికాని వాడివి ఒక ఆడపిల్లతో తిరగటం తప్పుకాదని సమర్థించుకుంటావా? లోకం ఏమనుకుంటుంది? ఏదైనా బలహీనపు ఘడియలో అనుకోనిది జరుగుతే ఆ పిల్ల గతేం కాను? ఇక తల్లిదండ్రులమైన మా పరిస్థితి ఎలా ఉంటుందో కొంచెం ఊహించావా?"

రామం జవాబు చెప్పలేదు. పార్వతి పెంపకంలో వాడి కలవడిన సుగుణాలలో ఇది ఒకటి. పెద్దలు కసురుకున్నా వీలైనంతవరకు ఎదురు జవాబులు చెప్పకూడదు. తప్పు కొంచెం ఉన్నా మౌనంగా స్వీకరించాలి.

"ఒరే రామం! నువ్వు నా స్వంత కొడుకువి కాదు. అయినా, అంతకన్నా మిన్నగా పెంచాను. మామీద నేమాత్రం గౌరవం ఉన్నా ఇలాంటి తిరుగుళ్లు తిరగకు. నీవు చేసే పనుల కెన్నెన్ని వంకలు పెట్టి ఎందరెందరు నన్ను చిత్రవధ చేస్తున్నారో నీకేమైనా అర్థమౌతోందా? కాంతమ్మగారేమందో తెలుసా - చేతులు కాలిపోయింతరువాత ఆకులు పట్టుకున్నా లాభంలేదంది. నీవు ఆ పిల్లకు మనసిచ్చి, ఆమెది నీవు గ్రహిస్తే మా గతేమిటి?"

"అమ్మా! క్షమించు, నేనింత దూరం ఆలోచించలేదు."

"ఔనా! అందుకే చెబుతున్నాను. ఆ పిల్లతో స్నేహం తగ్గించి, నీ ఉద్యోగమేదో చేసుకుపో. నీకు తగిన పిల్లను మేము గాలిస్తున్నాము. ఏదీ, ఈ వైశాఖంలోనే కోడలుపిల్లను తెచ్చుకోవాలని నాకు చాలా ముచ్చటగా ఉంది" తృప్తిగా అంది పార్వతి. తన కొడుకు తన మాట జవదాటడన్న నిబ్బరం కలిగింది.

"అమ్మా!"

"ఏమిటి?"

"మరేంలేదు. నేను సరళను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. ఇంతవరకు మా మనస్సులు ఒకరికొకరు విప్పి చెప్పుకోకపోయినా, ఆమె కూడా నన్ను అతిగా ఆరాధిస్తున్నది. పైగా ఆమె ఏకాకి."

పార్వతి నిశ్చేష్టురాలైంది. తను ఏది జరగకూడదనుకొందో అదే జరిగింది. ఇరుగు పొరుగులవి

అపోహలు, వాటిలో సత్యం లేశమాత్రం ఉండదన్న ఆమె విశ్వాసానికో పెద్ద దెబ్బ తగిలింది. వాళ్లు ఓర్వలేకనే తమలో కలతలు రేపడానికి చేస్తున్న ప్రయత్నాలని హృదయంలో పదిలపరుచుకున్న దృఢ అభిప్రాయం ఛిన్నాభిన్నమైంది.

ఇప్పుడు రామం రెక్కలు వచ్చిన పక్షి. గూడు అవసరం లేదు వాడికి. తన మానాన తను ఎగిరిపోగలడు. వాడిన నిరోధించటం తనకు సాధ్యమా? పెంచిపెద్ద చేసిన వారిపట్ల వాడు చూపవలసిన గౌరవం ఇదేనా?

"రామం! నువ్వేం చెపుతున్నావో ఆలోచించావా? అమ్మాయి తల్లిదండ్రులు ఎవరో, వారు మనతో వియ్యానికి తగుదురో తగరో, నీ వాళ్ల అభిప్రాయాలు ఏమిటో నీకక్కరలేకపోయాయా? ఇంత గుడ్డిగా ప్రేమించే అధికారం నీ కెవరిచ్చారు? ఒకవేళ ఈ సంబంధం మాకు ఇష్టంలేని పక్షంలో నీవెంత పరితపించవలసి ఉంటుందో... ఇదేమీ నీకు తెలియదా? లేక జీవితం సినిమా అనుకున్నావా?

రామం మౌనమే వహించాడు.

"రామం! నీకుతెలుసో తెలియదో ఆ పిల్ల తండ్రి స్వభావం, గుణం మంచివికావు. రత్నంలాంటి భార్యను, పనసపండులాంటి కూతుర్ని విడిచి, ఎవత్తెనో లేవదీసుకు వెళ్లిపోయాడు. అతడు వెళ్లిపోయిన తరువాత ఆమె జీవితాన్ని ఎలా గడిపిందో, ఎలా పిల్లను పెంచిందో అనూహ్యం. అట్లాంటి వంశంలో పిల్లను చేసుకోవటం నాకు సమ్మతంకాదు. మీనాన్నగారు తగిన సంబంధం చూస్తారు. అంతవరకు వేచి ఉండు."

"ఆ పిల్ల తండ్రిచేసిన తప్పు కీ పిల్లకా శిక్ష? కలిగిన వాళ్ల ఇళ్లలో ఊడిగంచేసి నీతిగానే పెంచింది అమె తల్లి. పాపం! కుమార్తె మంచి రోజులు చూసుకునే అదృష్టం నోచుకోక అల్పాయుష్షుతోనే కన్నుమూసింది. అలాంటి పిల్లకు నే నన్యాయం చెయ్యలేను.

"అంతవరకు వ్యవహారం నడిచిందన్నమాట!"

"ఇందులో అపోహకు తావులేదు. మా ఇద్దరి మధ్య ఇంతవరకు ఏ అనుకోరాని సంఘటనా జరగలేదు. కాని, ఆమె మనస్ఫూర్తిగా నన్ను నమ్ముకొంది. నాకామె అభిప్రాయాలు నచ్చాయి. ఇక వాళ్ల వంశ మర్యాదలా? నన్ను ఏం చూసి ఆరేదేళ్ళ వయస్సులో చేరదీశావు? నా తల్లెవరో, తండ్రెవరో, అక్రమ సంబంధంవల్లనే పుట్టానో..ఏమీ తెలుసుకోకుండా పెంచావే - ఆమెను స్వీకరించే సంస్కారం నీలో లేదని ఎలా అనుకోను?"

"ఒరేయ్! నాకు నీతిపాఠాలు చెప్పనవసరంలేదు. నీమీద మా కెన్నో ఆశలున్నాయి. ఈ రోజు నువ్వు మమ్మల్నికాదని ఆమెను చేసుకుంటాననటం భావ్యంకాదు. నీకో చెల్లెలుందని, దాని భవిష్యత్తు నీమీద ఆధారపడి ఉంటుందని మరువకు."

"అమ్మా! చెల్లెలికి నేనేమీ తక్కువ చెయ్యనే!"

"నీకెలా చెబితే అర్ధమౌతుందో నాకు తెలియదు. కానీ కట్నం తీసుకోకుండా నీకు పెళ్ళి చేస్తే దాని పెళ్ళి సంగతేమిటి? నీ అంత ఉదారులే అందరూ అయితే అది వేరే సంగతి. కట్నకానుకలమీద నాకు ఆశ అని భావించకు. మీ నాన్న రెక్కలు ముక్కలు చేసుకు సంపాదిస్తున్నది మన భుక్తికే చాలడంలేదు. మిమ్మల్ని ఇంత చదువులు చదివించడానికి తనెంత పరిశ్రమించారో నీకు తెలుసా? నీదేమైనా

కలెక్టరుద్యోగమా? నీ సంపాదన మీ భార్యభర్తలకే బోటాబోటి. మరి దాని పెళ్ళి సవ్యంగా జరగాలా? అది అయినింటి కోడలు కావాలా? వీటన్నిటికి డబ్బెక్కడి నుంచి వస్తుంది? మనవద్ద నిధి నిక్షేపాలు లేవే? పైగా నువ్వా ఊరుపేరులేని పిల్లను చేసుకుంటే దానికి మంచి సంబంధం రాదు కూడా."

"అమ్మా! చెల్లెలి పెళ్ళికిప్పటినుండే ప్రయత్నాలా? దాని వయస్సెంత? నీ ఆశీర్వాదం ఫలితంగా నాకు ఇంతకంటే మంచి ఉద్యోగం, జీతం దొరక్కపోవు."

'రెక్కలు రాగానే ఎగిరిపోవడానికి మనమేమీ పక్షులముకాము. సంఘంలో కొద్దోగొప్పో పరువున్న వ్యక్తులం. సంఘం కట్టుబాట్లను ఎదిరించి మనలేము. సరళను చేసుకోవటం నా దృష్టిలో ఎంతమాత్రం మనకు లాభదాయకం కాదు!"

"అమ్మా! ఇదేనా నీ నిర్ణయం? ఒక్కమాట. ఒకవేళ సరళనే పెళ్ళిచేసుకోకపోతే బహుశా నేనసలు పెళ్ళే చేసుకోను"

పార్వతికి కోపం నసాళానికెక్కింది.

"అనుకున్నదంతా అయింది. అద్దాలనాడే బిడ్డలు కాని గడ్డాలనాడా అని ఊరికే అనలేదు. రోడ్డుపక్క పెంటకుప్పలో కుళ్ళుతున్న నిన్ను చేరదీసి రెక్కలు ముక్కలు చేసుకొని నిస్వార్థంగా పెంచి నందుకు తగినశాస్తే చేశావు. వెనకటికెకరో చెప్పినట్లు కనకపు సింహాసనాన శునకాన్ని కూర్చోపెడితే తోలు ముక్క కోసం పరుగెట్టిందట. అలా ఉంది నీ వ్యవహారం. ఒరేయ్! నాలో నిగ్రహాన్ని పరీక్షించకు. నీకు మేమే కావాలో, ఆ పిల్లేకావాలో నిర్ణయించుకో. ఆమె కావాలన్న మోజుంటే ఇక్కడినుండి తక్షణం కదులు. నువ్వేమైనా నా కన్నకొడుకువా నామాట మీద నిలబడడానికి!"

"ఇదేనా, అమ్మా, నీ నిర్ణయం?"

"నిర్ణయించుకోవలసింది నువ్వు - నేను కాదు."

"అమ్మా! ఇలాంటి విపత్కర పరిస్థితి వస్తుందని అనుకోలేదు. నిన్ను నా కన్నతల్లి లాగానే భావిస్తున్నాను. నాలో సంస్కారం నశించి పోలేదు. రెక్కలురాగానే ఎగిరిపోవాలని నేను కోరుకోవటంలేదు. నీ ఆదరణ, ఆత్మీయత నాకు మరుపురానివి. మిమ్మల్ని విడిచి వెళ్లటం నాకసాధ్యమైనది. కాని, మీ మీద గురి, విశ్వాసంతో నన్నే నమ్ముకున్న ఆ అనాథపిల్ల కన్యాయం ఎలా చెయ్యను? ఆమె కాని ఏ కలిగినింట పిల్లో అయితే, నాకింత బాధ లేకపోను. నా మనస్సు నర్థం చేసుకోవా?"

"తీయని మాటలతో నా మనస్సు మార్చాలనుకోవటం - అవివేకం. ఎన్నెన్నో ఊహాసౌధాలు కట్టుకున్నాను నిన్ను చూస్తూ. ఇప్పుడవన్నీ పేకమేడల్లా కూలిపోవటం నేను భరించలేను. నీకు మా పట్ల విశ్వాసం ఏమైనా వుంటే నే చెప్పినట్లు నడుచుకో. లేకుంటే ఒక్కక్షణం ఇక్కడ నిలబడకు. వెళ్లు .తెలిసిందా."

"అమ్మా!"

"ఏనాడైతే నా మాట జవదాటావో ఆ నాడే నీకు నాకు సంబంధం చెల్లిపోయింది. కుక్కకుండే విశ్వాసం నీకు లేదు."

రామానికి తల్లి ఒక్కొక్క పలుకు ఒక్కొక్క శూలంలా గుచ్చుకొంది. తను చేసింది అసమంజసమైనది కాదే!

రామంలో ప్రవహించే రక్తం పార్వతి రక్తం కాకపోవచ్చు. అయితే, ఆమె పెంపకంలో పెరిగిన వాడిలోనూ ఆమెకున్నంత పౌరుషము ఉంది. తల్లి మాటిమాటికి నొప్పించేసరికి వాడి హృదయం గాయపడింది. "అమ్మా! నువ్వు నన్ను కనకపోయినా పెంచావన్న విశ్వాసం నాకు లేకపోలేదు. నేను నీపట్ల అగౌరవంగా ప్రవర్తించిన క్షణం లేదు. అయినా, మాటిమాటికి నా జన్మను జ్ఞప్తికితెస్తూ నన్ను కుక్కకంటే హీనంగా పరిగణిస్తున్నావు. ఇంతకంటే చిటికెడు విషం నీ చేత్తో ఇస్తే తృప్తిగా తిని ప్రాణాలు విడిచేయగలనేమో! మనిషికి మనిషి ఆసరా కావాలి. నీ వో నాడు చేసిన పనే నేడు నేను చేద్దామనుకుంటే దాన్ని వ్యతిరేకించటం–నీది స్వార్థంకాదా? నేను రెక్కలొచ్చిన పక్షిని కాను, రెక్కలు తెగిన పక్షిని. వస్తా."

రామం కట్టుబట్టలతో వీధిన పడ్డాడు.

రామం వెళ్ళిపోవడంతో పార్వతి ఈ లోకంలోని కొచ్చింది. వాడు నిజంగా వెళ్ళిపోయాడా? ఇంటికి ఆవురావురుమంటూ ఆకలితో వచ్చినవాడికి పట్టెడు మెతుకులు కూడా పెట్టకుండా కట్టుబట్టలతో తగిలేసిందా! ఆమె మాతృహృదయం తల్లడిల్లింది. కంటికి మంటికి ఏకధారగా ఏడుస్తూ అలానే కూర్చుండిపోయింది.

★ ★ ★

అగ్ని పర్వతం ఏదో ఓనాడు బద్దలవకమానదు. చిన్న విషయమే చినికిచినికి గాలివాన కావటం అవాస్తవికంకాదు. ఇట్లాంటి దుష్పరిణామం ఏదోనాడు సంభవిస్తుందని మొదటినుండి ఊహిస్తూనే వచ్చాడు విశ్వనాథరావు.

పెంటకుప్ప మీద ఎంగిలి విస్తరాకుల కోసం కుక్కలతోపాటు దెబ్బలాడి విస్తరి చేజిక్కించుకునే బాలుడు తన ఉన్నతిని కలనైనా తలంచి ఉండడు. వాడి ధ్యేయం, జీవితాశయం ఒక్కటే - అదే రెండుపూటలా పట్టెడన్నం దొరుకుతే చాలన్నదే!

ఒక రోజు వాడు ఎంగిలి విస్తరాకు కోసం ఎగబడుతూంటే పార్వతి కంటపడింది. వాడిని పిలిచింది. పెంటకుప్పమీద విస్తరి తీసుకుంటే ఈమెకెందుకు కసి అనుకుంటూ భయపడుతూనే వచ్చాడు.

"అబ్బాయి! అలా పెంటకుప్పమీద విస్తరి తీసుకుని ఎంగిలిమెతుకులు తింటావా? తప్పుకదూ?" మందలించింది.

"ఆకలి" మూడే అక్షరాలు వచ్చాయి వాడి నోటినుండి.

"బాబూ! ఆకలిగా ఉందా? నీకు ఎవరూ లేరా?"

"లేరు"

పార్వతి మాతృహృదయం తల్లడిల్లింది. అన్నపూర్ణలాంటి తెలుగుగడ్డ మీద ముక్కు పచ్చలారని పసిబాలుడికి పట్టెడుమెతుకులు కరువయ్యాయా? మొగ్గగానే వాడిపోయిన వాడి జీవితంపట్ల ఆమెకు చెప్పలేని వ్యధ కలిగింది. చిన్నతనంనుండి ఉన్నతభావాలు, విధివంచితులపట్ల ప్రేమానురాగాలు కల ఆమె ఆ బాలుణ్ణి స్వీకరించింది.

పార్వతికప్పుడు నిండా ఇరవైఏళ్లులేవు. పెండ్లై రెండు సంవత్సరాలు కాలేదు.

"ఏమండీ! పాపం వీడికి తల్లితండ్రి లేరుట. ఆకలితో అలమటించి పోతున్నాడు. మనం పెంచుదాం" అంది విశ్వనాథరావుతో.

పనికుర్రాడి అవసరం ఉన్న విశ్వనాథరావు అందుకు అభ్యంతరం చెప్పలేదు.

వాడిని సాకే విధానం విశ్వనాథరావుకే కాదు, ఇరుగుపొరుగుల వాళ్ళకుకూడా విచిత్రంగా తోచింది.పార్వతి ఆప్యాయంగా వాడికి నచ్చినవి వండి, కన్నతల్లిలా తినిపించేది. రాత్రి వాడిపక్కలో పరుండి నీతి బోధకమైన కథలు, కబుర్లు చెబుతూ నిద్ర పుచ్చేది. వాడికి చదువుపట్ల ఆసక్తి కలిగించి, మాష్టర్ని పెట్టి చదువు చెప్పించసాగింది.

“వాడు నీ కేమైనా తమ్ముడా, చుట్టమా? కన్న కొడుకులా సాకుతున్నావు. వీధినపడి బతికేవాడు – వాడి జాతేమిటో, వంశమేమిటో? రేపు మీ ఇంట్లో ఉన్నదంతా ఊడ్చుకు పోతే తరవాత విచారించి ఫలితం ఉండదు.” ఒకరిద్దరు పార్వతి కిదే ధోరణిలో హెచ్చరిక చేశారు. విశ్వనాథరావుకుకూడా ఇలాంటి అభిప్రాయాలు కలక్క పోలేదు.

“పార్వతీ! వాణ్ణి అధికంగా ప్రేమిస్తున్నావు. రేపు వాడేదైనా నైచ్యానికి పాలుబడితే విచారించవలసి వస్తుంది. రెండు పూటలా పట్టెడు మెతుకులు పెట్టడంలో నా కభ్యంతరం లేదు కాని, వాడిని అలా అక్కున చేర్చుకోవడం నాకసందర్భంగా ఉంది.”

“బాగుందండీ మీ ఆలోచన,వాడికి కావలసింది తిండే కాదు. తల్లి ప్రేమ. పాపం ఎక్కడ పుట్టాడో, ఏమో! తల్లి తండ్రికూడా తెలియకుండా పెరిగాడు.”

“భగవంతుడికి వాడిపట్ల కనికరం లేకపోవచ్చు. అయితే, అనాథల్ని తీసుకువచ్చి మన మెలా పెంచగలం? వాడికి చదువు సంధ్యలు చెప్పించడం మనకు సాధ్యమా?రేపోమాపోవాడు హఠాత్తుగా మనల్ని వదిలేసి వాడి దారిని వాడు పోతే నీవు భరించగలవా?”

“సంస్కారం జన్మతో కాదు, పెంపకంతో అలవడుతుంది. రామం నా పెంపకంలో ఉన్నతు డౌతాడు. ఆ ఆశ నాకుంది. రెండు పూటలా ఇంత తిండి పడేస్తే కుక్కైనా విశ్వాసంగా పడి ఉంటుంది మరి మానవుడికి ఉండదా? వాడు మనల్ని విడిచి ఎందుకు వెళ్ళి పోతాడు?”

ఆమె ఆత్మవిశ్వాసం పట్ల నమ్మకం ఉన్నా, విశ్వనాథరావు ఈ ఆప్యాయత ఎల్లకాలం ఎలా నిలుస్తుందో అన్న సంశయానికి లోనయ్యాడు. పార్వతి రామాన్ని కన్నకొడుకులా చూడడం, వాడి ఆలనా పాలనా నెత్తిని వేసుకోవడం ఆఖరి కామె తల్లిదండ్రులకుకూడా నచ్చలేదు.

“పెండ్లై నిండా రెండు సంవత్సరాలు కాని నీకు ఆరేళ్ళ దత్తపుత్రుడా! వింటే లోకం నవ్విపోతుంది. పైగా రేపు నీకో నలుసు కలుగుతే వీణ్ణి ఇంత ఆపేక్షగా చూడగలవా? అప్పుడు వీడెంత కుమిలిపోతాడు? తల్లీ! నామాట విని లేనిపోని ఆపేక్షలు, అనుబంధాలు పెంచుకోకు” తల్లి సలహా యిచ్చింది.

పార్వతి నిర్ణయం మారలేదు. వాడిని తీర్చిదిద్దడం కోసం తను ఏమైనా త్యాగం చేస్తుంది. కాని, ఓ దీపం చమురులేక ఆరిపోవడానికి వీలులేదు. తొలి సంతానంగా వాడినే భావించింది. మరో ఆరు నెలలకు పద్మ పుట్టింది. అంతే. లోకు లపోహ పడుతున్నట్లు తనకు కాని కొడుకు పుడితే వీడి నింత ప్రేమానురాగాలతో చూడగలనో లేనో అన్నభావం మరి బిడ్డలు కలుగకుండా ఆపరేషను చేయించుకుంది. దీనితో విశ్వనాథరావుకి మతిపోయింది. ఇరుగుపొరుగు లాశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు.

పార్వతి పెంపకంలో రామం చురుకుగా తయారయ్యాడు. తల్లిదండ్రులపట్ల, సోదరిపట్ల అవాజ్యప్రేమానురాగాలతో మసలేవాడు. వాడు కొంచెం ఆలస్యంగానైనా మెట్రిక్‌పరీక్ష పాసై, ఇంటరు పరీక్ష ఈ మధ్యనే ఇచ్చాడు.

మొదటినుండి ఈ అసంబద్ధపు మమతానురాగాలు విమర్శిస్తూ వస్తున్నఅయినవాళ్లు, కాని వాళ్ళు ఈ ఇసుకమేడ నిలిచేదెన్నాళ్లు? ఆ తల్లీబిడ్డ మధ్య మనస్పర్థలు రావా? వారు వేరుకారా? అని భావిస్తూనే వచ్చారు. వీలైనంతవరకు వాళ్ళు పార్వతీ, రామాలకు సమయం దొరికినప్పుడల్లా వాడు నీ స్వంతబిడ్డడా? లేక నీ కన్నతల్లా ఆమె అని హెచ్చరించేవారు.

రామాన్ని ఆమె కసిరికొట్టిన క్షణాలు లేకపోలేదు. రామం అలిగిన వేళలు లేకపోలేదు. అయినా అనురాగం అధికమయ్యేదికాని, ఇసుమంతైనా తరిగేదికాదు.

ఇంత అపురూపంగా పెంచిన తల్లి కుమారుణ్ణి ఇంటినుంచెలా తగిలేసింది? ఇది విశ్వనాధానికి అర్థం కాని శేష ప్రశ్న.

★ ★ ★

విశ్వనాధరావు రామాన్ని కలుసుకున్నాడు. ఎలాగైనా వాడిని ఒప్పించి ఇంటికి తీసుకురావాలి. పార్వతి వాడి కోసం పరితపించి పోతుంది.

"నాన్నగారూ! మీరు కూడా నన్ను అర్థం చేసుకోలేరా? సరళ కన్యాయం ఎలా చెయ్యను? అమ్మ పెంపకంలో నా నరనరాల్లోనూ కరుణా, సానుభూతి నిండిపోయాయి. ఇప్పుడు సరళను తిరస్కరిస్తే ఆమె గతేంకాను?"

"బాబూ! మరి నువ్వు అమ్మతో మీరిద్దరూ మనసులు విప్పి మాట్లాడుకోలేదన్నావే?"

"ఆ మాట నిజమే. నేను సరళను నా మనస్సులోనే స్వీకరించాను. ఆ సంగతి ఆమెకు తెలియ పరచని మాట వాస్తవమే. అంతమాత్రాన నేనామెను తిరస్కరించలేను."

"అయితే, మీ అమ్మ ఈక్షోభతో కృశించి పోవలసిందేనా? ఇంతకాలమై ఆమె నీగురించి ఎంత పాటుపడింది?"

"నాన్నా! నాకామెపట్ల ఉన్న విశ్వాసాన్ని ఎలా వ్యక్తం చెయ్యడం? కుక్క కంటే నీచుణ్ణి అని మాటిమాటికి తూలనాడుతూంటే ఆమె ముందెలా నిలుచోను? నాలో ప్రవహించేది నీరు కాదు, అందరిలాంటి రక్తమే. పెంటకుప్పమీద బ్రతికే నన్ను చేరదీసి నాలో నిద్రాణమైన ప్రేమానురాగాలను జాగృతం చెయ్యడం ఆమెచేసిన పొరపాటు. నాలోనూ ఆశలు, ఆశయాలు ఉంటాయని, వాటిని అరికట్టడం అన్యాయమని తెలుసుకోలేక పోవటం మరో తప్పు. నన్నామె చేరదీయకుంటే ఏనాడో ఏ లారీ కిందపడో దిక్కులేని చావు చచ్చేవాడిని. లేదా దొంగగానో, రౌడీగానో తయారయ్యి చెరసాలలో మగ్గుతూండేవాడిని, అలాగైనా నాలో ఈ మనః క్షోభ ఉండేదికాదు. అయితే, అమ్మ అనుమతించేవరకు సరళను పెండ్లాడే ప్రసక్తిలేదు."

మరి వాడి ముందు నిలువలేకపోయాడు విశ్వనాధరావు. వాడి మనఃక్లేశం ముందు తమదెంత? ఆలోచించగా ఆలోచించగా విశ్వనాధరావుకి పార్వతి దోషమే అధికంగా కనుపించింది. రామాన్ని ఇంత వ్యామోహంతో పెంచకుండా ఉండవలసింది. పెంచినా, నిన్ను పెంచి ఒక జీవిత గమ్యాన్ని

చూపెట్టినందుకు ప్రతిఫలంగా నా ఆజ్ఞలను జవదాటకు అని వాడిని కట్టడి చెయ్యకుండా ఉండవలసింది. ఇప్పుడు పిచ్చి కుదిరితే కాని పెళ్ళికాదు, పెళ్ళైతే కాని పిచ్చి కుదరదులా ఉంది పరిస్థితి. విశ్వనాథరావు ఇటు పార్వతికి నచ్చచెప్పి విఫలమై అటు తనయున్ని ఒప్పించనూ లేక అంతా దైవంమీద భారంవేసి ఊరకున్నాడు.

★ ★ ★

సుమారు వారం రోజులు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి. పార్వతి ఈ వారం రోజులు ఎడతెగక దుఃఖిస్తూనే ఉంది. 'తనలో ఓర్పు, సహనం, సంస్కారం ఏమయ్యాయి? రామం చేసిన తప్పు ఏముంది? రామం వంటి అనాథ బాలుణ్ణి నిస్వార్థంగా చేరదీసిన తను సరళను స్వీకరించడానికి ఎందు కభ్యంతరం చూపింది? ఇది తనలోని బలహీనతా? లేక ఇరుగుపొరుగులముందు తను ఓడిపోయానన్న భావం కలుగకూడదన్న తపనా?"

పార్వతి కెంత యోచించినా తన తీర్పులో దోషం కనిపించలేదు. పోస్టుమెన్ కేకతో వీధిలోనికి వచ్చి ఉత్తరాన్ని అందుకుంది. సాధారణంగా ఇంటికి వచ్చే అన్ని ఉత్తరాలు భర్తపేర రావటమే పరిపాటి. కాని, ఈ ఉత్తరం తన పేర ఉంది. ఆత్రుతతో విప్పి చదివింది.

"పార్వతిగారికి సరళ నమస్కారములు.

రామం ద్వారా మీ ఇంటి పరిస్థితులు గ్రహించాను. నా మూలంగా తల్లీకొడుకుల మధ్య కలతలు రేగటం, వ్యధచెందటం నాకు చాలా విచారాన్ని కలిగిస్తు న్నది. రామంతో నాకున్న పరిచయం చాలా స్వల్పం. ఇంత తక్కువ వ్యవధిలోనే అతణ్ణి విడిచి ఉండలేని స్థితికి వచ్చిన నేను, అతని తల్లిగా మీ రెంత కుమిలిపోతున్నారో అర్థం చేసుకోగలను. నేను మీ మధ్య కలతలకు హేతువునవుతానని ఊహించలేదు. మీరు నన్ను నిరాకరించడానికి చూపిన కారణాలు సంఘం దృష్టిలో సబబైనవే. ఒక అనామకురాల్ని ఆదరించమని ఏ ముఖం పెట్టుకుని అడగను?

రామం నుండి నేనెప్పుడు ఏది ఆశించలేదు. నా అన్న వాళ్లు లేని నాకు అతని చెలిమి ఆనందానికి హేతువైంది. అతనికి తెలియబరచకపోయినా అతణ్ణి అమితంగా ప్రేమించాను.

తెగిన గాలిపటం లాంటి నా జీవితానికి మీ ఆదరాభిమానాలు లభిస్తాయని ఆశపడ్డాను. ఎందుకైనా అదృష్టం కలిసి రావాలి. తల్లీబిడ్డలు నా మూలంగా వేరుకావటం నేను సహించలేను. నన్ను మరిచిపొమ్మని, మీకు పుత్రప్రేమను అందించవలసిందిగా రామాన్ని కోరుతూ ఉత్తరం వ్రాశాను. నా కోరిక అతడు మన్నిస్తాడన్న ఆశ ఉంది. దయతో మీరు రామం తప్పులు క్షమించి అతణ్ణి పూర్వపు ఆదరాభిమానాలతో మీలో కలుపుకోవలసిందిగా కోరుతున్నాను.

ఇట్లు

మీకు ఏమీ కాలేకపోయిన అభాగ్యురాలు – సరళ.

★ ★ ★

ఉత్తరం చదివిన పార్వతి నిశ్చేష్టురాలైంది. ఎంత ఉన్నతురాలు సరళ! ఆమె ముందు తనెంత అల్పురాలు!

"ఏమండీ! సరళ ఉత్తరం వ్రాసింది. మన సుఖం కోసం తన సుఖాన్ని త్యాగం చేసింది"

సంతోషంగా భర్తకు చెప్పింది పార్వతి.

"ఏమండీ! సరళ నిజంగా నాలో కనువిప్పు కలిగించింది. నేను నిజంగా అల్పురాల్ని. ఆమెలో ఉన్న విశాలత నాలో లేకపోయింది. ఆమెను తృణీకరించబోయిన నా బలహీనతనుకూడా ఆమె సమర్థించింది. రామాని కన్నివిధాల తగిన పిల్ల. పదండి, ఇప్పుడే వెళ్లి ఆమెను తీసుకువద్దాం."

ఆమెలో పరివర్తన విశ్వనాథానికి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. వస్తుతః ఉన్నత భావాలు కల తన భార్య లోకులు చెప్పే మాటల్లో సత్యముందని, సరళ నతడు వివాహమాడితే తనకు కాకుండా పోతాడన్న వారి వాదం సరైనదని భ్రమించింది. సరళ ఉత్తరంతో ఆ భ్రమ దూరమైంది.

వాళ్ళు సరళ ఇంటికి వెళ్ళేసరికి ఇంటికి తాళం వేసి ఉంది. పొరుగింట్లో కనుక్కోగా ఆమె గతరాత్రే పెట్టేబేడా సర్దుకొని వెళ్లిపోయిందని తెలిసింది.

"మీరేనా పార్వతిగారు? ఈ ఉదయం పార్వతిగారు వస్తే వారికివ్వండని ఇచ్చింది?" అంది పొరుగింటామె, ఒక ఉత్తరాన్ని ఇచ్చి.

వణుకుతున్న చేతులతో ఉత్తరం అందుకొని చదివింది.

"పార్వతిగారికి నమస్కారములు.

మీరు తప్పక వస్తారన్న నమ్మకం నాకుంది. మనుషులు మానవత్వంతో మనడం కంటకప్రాయంగా తలంచే కొందరు స్వార్థపరులు చెప్పే చెప్పుడుమాటలు మనకు హితవుగానే తోస్తాయి, కొన్ని కొన్ని క్షణాల్లో. ఒక విషయాన్ని పలువురు నొక్కి చెపుతుంటే అందులో సత్యం ఉందని భ్రమించటం అసహజంకాదు. అదే మన బలహీనత. రామం నన్ను పెళ్లి చేసుకుంటే మిమ్మల్ని పూర్వపు ప్రేమాభిమానాలతో చూడడనుకోవటం అవివేకం. నన్ను కాకుంటే వేరొకరినైనా అతడు వివాహం చేసుకుంటాడు. ఈ పెండ్లికి సమ్మతించటం మీ ఓటమిగా నలుగురు చెప్తుతూంటే మీరూ ఆత్మవిశ్వాసం కోల్పోయారు. మీలోనూ ఇంత బలహీనత ఉంటుందని నేను ఊహించలేదు.

పుట్టగానే తండ్రి ఆదరాభిమానాలకు దూరమయ్యాను. ఒంటరి ఆడది పరువుగా బ్రతకడానికి అవరోధాలు కల్పించే సంఘంలో నన్ను పెంచడానికి ఎన్ని ఇబ్బందులకు లోను అయిందో మా అమ్మ – తలుచుకుంటేనే భయంగా ఉంది. ఏమైతేనేమి? తన ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా నన్నింతదాన్ని చేసింది. తను మాత్రం శుష్కించి, క్షీణించి మరణించింది. రామం నా జీవితంలో ప్రవేశించటం నాకో వరప్రసాదం అనుకొన్నాను. కాని, నా ఆశ క్షణభంగురమని గుర్తించలేకపోయాను. తల్లీ కొడుకుల మనోవ్యథలకు కారకురాల్ని కారాదు. నారు పోసినవాడు నీరు పోయక మానడు.

సహజంగా ఉదారులైన మీలో నా నిన్నటి ఉత్తరంతో పరివర్తన రావటం అసహజం కాదు. కాని, ఒక పర్యాయం మీ కళ్లకు హేయంగా కనుపించిన నేను మీచెంత నూరేళ్ల జీవితం ఎలా గడపగలను? నాలోనూ ప్రవహిస్తున్నది రక్తమే. అందుకే వెళ్ళిపోతున్నాను – దూరంగా, మీ దృష్టి కందనంత దూరంగా. అయితే, ఆత్మహత్యవంటి ప్రయత్నాలు చెయ్యను. జీవితం బంగారు బాటగా దిద్దుకోవాలన్న ఆశ నాలో చావలేదు.. రామాన్ని ఆదరించమని తిరిగి అర్థిస్తూ...

మీకు పరితాపం కలిగించిన – సరళ."

**(ఆంధ్రప్రభ – సచిత్ర వారపత్రిక 8.10.1975)**